FOCUS TELUGU TV
అనునిత్యం - ప్రజాపక్షం

@netifocusnews @focustv
www.netifocusnews.com
http://epaper.netifocusnews.com
TS-18-0006625

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...
తెలుగు డిజిటల్ దినపత్రిక

ఎడిటర్: యం.తరుణ్ | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక || హైదరాబాద్ || ఆదివారం 30, జూన్ 2024 || పేజీలు: 04

## కాంగ్రెస్ సీనియర్ నేత
# డీఎస్ కన్నుమూత

**శనివారం ఉదయం గుండెనొప్పికి గురైన ధర్మపురి శ్రీనివాస్**

- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస
- నిజామాబాద్‌కు భౌతికకాయం తరలింపు
- నేడు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు



**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్,జూన్29:**

తెలంగాణ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ కన్నుమూశారు. గతకొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న డీఎస్.. శనివారం తెల్లవారుజామున 3 గంటలకు తుదిశ్వాస విడిచారు.దీంతో బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని ఆయన స్వగృహానికి భౌతికకాయాన్ని తరలించారు. మధ్యాహ్నం 2 గంటల వరకు పార్టీ నాయకులు, అభిమానులు, ప్రజల సందర్శనార్థం ఉంచనున్నారు. అనంతరం నిజామాబాద్ పట్టణానికి తరలిస్తారు. ఆదివారం మధ్యాహ్నం ఆయన సొంత నియోజకవర్గమైన ఇందూరు పట్టణంలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తారు. ఇదే విషయాన్ని కుటుంబ సభ్యులు కూడా వెల్లడించారు. మిగతా 2లో..

# ఆదిలాబాద్ మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్ హఠాన్మరణం

- ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృత్యువాత
- సంతాపం తెలిపిన సిఎం రేవంత్, కేంద్రమంత్రులు, బిజెపి నేతలు..



**నేటి ఫోకస్ న్యూస్, ఆదిలాబాద్-జూన్29:**

ఆదిలాబాద్ మాజీ ఎంపీ రమేష్ రాథోడ్(59) కన్నుమూశారు. శుక్రవారం అర్ధరాత్రి ఉట్నూర్‌లోని తన నివాసంలో అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తీసుకువస్తుండగా.. మార్గమధ్యంలో ఇచ్చోడ వద్ద తుది శ్వాస విడిచారు. మిగతా 2లో..




# జగజ్జేత భారత్

## 17ఏళ్ల తర్వాత టీ20 ప్రపంచ కప్ టీమిండియా కైవసం



- ఉత్కంఠ ఫైనల్లో దక్షిణాఫ్రికాపై విజయం
- విరాట్ అర్ధసెంచరీ
- అదరగొట్టిన హార్దిక్, బుమ్రా
- మలుపు తిప్పిన సూర్య క్యాచ్



**బ్రిడ్జ్‌టౌన్:** ఎన్నాళ్లయింది భారత క్రికెటర్లలో ఈ ఆనందాన్ని చూసి... ఎన్నేళ్లయింది భారత క్రికెట్ అభిమానులు ఇలాంటి గెలుపు సంబరాలు చేసుకొని.. అందినట్లే అంది చేజారిపోతున్న ఐసీసీ ట్రోఫీ విజయాలు.. ఆఖరి మెట్టుపై తడబడిన ప్రపంచ కప్ సమరాలు.. అన్నీ దాటి ఇప్పుడు ఆహా అనిపించే ప్రదర్శనతో భారతజట్టు సగర్వంగా నిలిచింది. రెండోసారి విశ్వ విజేతగా త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించింది. 2007లో తొలి టైటిల్ నెగ్గిన తర్వాత ఆరు ప్రయత్నాల్లో విఫలమైన టీమిండియా మళ్లీ ట్రోఫీని అందుకుంది. మిగతా 2లో..



## చైనా సరిహద్దుల్లో
# విషాదం

- వరద ఉధృతికి యుద్ధ ట్యాంక్‌తో సహా కొట్టుకు పోయిన ఐదుగురు జవాన్లు
- ఆకస్మిక వరదలే కారణమని రక్షణశాఖ వెల్లడి
- తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన రాజ్‌నాథ్ సింగ్

2



## హెరిటేజ్ సిటీగా
# వరంగల్ అభివృద్ధి

- వెంటనే ప్రణాళికలు సిద్ధం చేయండి
- ఔటర్ రింగ్ రోడ్డుకు ప్రతిపాదనలు
- వరంగల్ పర్యటనలో అధికారులతో సిఎం రేవంత్ సమీక్ష..

**నేటి ఫోకస్ న్యూస్, వరంగల్-జూన్29:**

వరంగల్ అభివృద్ధికి సహకారం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, హైదరాబాద్‌తో సమానంగా వరంగల్‌ను అభివృద్ధి చేయాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. వరంగల్ పర్యటనలో ఉన్న ఆయన నగర అభివృద్ధిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. మిగతా 2లో..

## సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ
# వ్యయం పెంపు

- నిబంధనలకు విరుద్ధంగా అనుమతులపై సిఎం ఆగ్రహం
- మౌఖిక ఆదేశాలతో ఎలా పెంచుతారని రేవంత్ ప్రశ్న

**నేటి ఫోకస్ న్యూస్, వరంగల్-జూన్29:**


వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం విషయంలో ఇష్టారీతిన అంచనా వ్యయం పెంచడంపై అధికారులపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా రూ.1100 కోట్లున్న అంచనా వ్యయాన్ని రూ.1726 కోట్లకు ఎలా పెంచారని సీఎం ప్రశ్నించారు. కేవలం మౌఖిక ఆదేశాలతో రూ.626 కోట్ల వ్యయం ఎలా పెంచుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అంచనా వ్యయం పెంచడమేంటనిరైయ్యారు. నిర్మాణ వ్యయంపై పూర్తిస్థాయి ఫోరెన్సిక్ ఆడిట్ మిగతా 2లో..



## కొండగట్టును దర్శించుకున్న
# పవన్ కళ్యాణ్

- ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన డిప్యూటీ సిఎం
- దారిపొడవునా అభిమానుల నీరాజనాలు

2






# మహిళలకు ఆర్థిక చేయూత

- గ్రామాల్లో మీసేవ కేంద్రాల అప్పగింత
- శిక్షణ, రుణ మంజూరుకు కసరత్తు

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-జూన్29:**

స్వయం సహాయక సంఘాలకు తెలంగాణ ప్రభుత్వం బంపర్ ఆఫర్ ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లో మీ సేవ కేంద్రాలను కూడా మహిళా సంఘాలకు అప్పగించాలని నిర్ణయించింది. ఈ సేవ, మీ సేవ పేరుతో కేంద్రాలను మంజూరు మిగతా 2లో..

# కేజ్రీవాల్‌కు మరోమారు షాక్



వివరాలు 02లో..

# మొదలైన అమర్‌నాథ్ యాత్ర

- భారీగా భద్రతా ఏర్పాట్ల మధ్య ప్రారంభం

వివరాలు 02లో..



## కొండగట్టును దర్శించుకున్న
# పవన్ కళ్యాణ్

**నేటి ఫోకస్ న్యూస్, కొండగట్టు-జూన్29:**

ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవన్‌ను చూసేందుకు భారీ సంఖ్యలో స్థానికులు ఆలయానికి తరలివచ్చారు. శనివారం ఉదయం హైదరాబాద్ నుంచి బయలు దేరిన పవన్‌కు.. మార్గమధ్యలో ప్రజలు ఘన స్వాగతం పలికారు. తుర్కపల్లి క్రాస్ రోడ్స్ వద్ద జనసేన నాయకులు గజమాలతో ఆయనను సత్కరించారు. పవన్ రాక నేపథ్యంలో.. జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. హైదరాబాద్‌లోని తన నివాసం నుంచి రోడ్డుమార్గంలో శనివారం ఉదయం ఆయన కొండ గట్టుకు బయల్దేరారు. ఈ సందర్భంగా ఆయనకు దారి పొడవునా అభిమానులు ఘనస్వాగతం పలికారు. ముందుగా హైదరాబాద్ శివారులోని తుర్కపల్లిలో పవన్ కల్యాణ్‌ను చూసేందుకు భారీగా తరలివచ్చారు. తుర్కపల్లి నుంచి బయల్దేరిన తర్వాత సిద్దిపేట జిల్లా ములుగు మండలం వంటిమామిడి వద్ద కూడా జనసేన అధినేతకు ఘన స్వాగతం లభించింది. అక్కడ పవన్ కల్యాణ్‌ను గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా అభిమానులు అందించిన వీరఖడ్గంతో ఆయన ఫొటోలకు పోజులిచ్చారు. అనంతరం అభిమానులకు అభివాదం చేసుకుంటూ కొండగట్టుకు బయల్దేరి వచ్చారు. ఏపీ ఎన్నికల్లో అఖండ విజయం సాధించడంతో పవన్ కల్యాణ్ వారాహి అమ్మవారి దీక్షను చేపట్టారు. 11 రోజుల పాటు నిష్టతో ఈ దీక్షను పాటించనున్నారు. ఈ క్రమంలోనే తమ ఇలవేల్పు అయిన కొండగట్టు ఆంజనేయ స్వామిని ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, గత ఏడాది ఎన్నికలకు ముందు ప్రచారం మొదలు పెట్టిన పవన్ కల్యాణ్.. తన వారాహి ప్రచార రథానికి కొండగట్టులోనే ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం వారాహి విజయయాత్రను నిర్వహించారు.

## మొదలైన అమర్‌నాథ్ యాత్ర

**నేటి ఫోకస్ న్యూస్, జమ్ము-జూన్29:**

భక్తులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్న అమర్‌నాథ్ యాత్ర శనివారం మొదలయింది. పవిత్ర గుహలో శివలింగ దర్శనానికి భక్తులు భారీ ఎత్తున్న రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. 48 కిమీ. నున్వాన్-పహల్గామ్ మార్గం, 14 కిమీ. బల్తాల్ మార్గం గుండా యాత్రికుల మొదటి బ్యాచ్ కదిలింది. రెండు మార్గాలల్లోని యాత్రికుల బ్యాచ్ లను సంబంధిత డిప్యూటీ కమిషనర్లతో పాటు పోలీసు, సివిల్ అధికారులు సాగనంపారు. జమ్మూలోని భగవతి నగర్ లోని యాత్రి నివాస్ బేస్ క్యాంపు నుంచి 4603 భక్తుల మొదటి బ్యాచ్కు జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ జనరల్ మనోజ్ సిన్హా జెండా ఊపి పంపారు. 1881 మంది యాత్రికులు ఉన్న రెండో బ్యాచ్ ను కూడా భగవతి నగర్ బేస్ క్యాంప్ నుంచి పంపారు. భక్తుల రక్షణ కోసం పోలీసులు, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్, ఇండో-టిబెటన్ బార్డర్ పోలీసులను మోహరించారు. వైమానిక నిఘా కూడా పెట్టారు. ఇదిలావుండగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పవిత్ర యాత్రకు ఉపక్రమించిన యాత్రికులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పరమశివుడి ఆశీస్సులతో భక్తులందరూ వర్ధిల్లాలని కోరారు.

## కేజ్రీవాల్‌కు మరోమారు షాక్

**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-జూన్29:**

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు 3 రోజుల సీబీఐ కస్టడీ శనివారం పూర్తయింది. కస్టడీ ముగియడంతో సీబీఐ అధికారులు.. కేజ్రీవాల్‌ను కోర్టులో హాజరు పరిచారు. విచారించిన రౌస్ అవెన్యూ కోర్టు కేజ్రీకి మరో 14 రోజులు జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ తీర్పు వెలువరించింది. జులై 12 వరకు ఆయన రిమాండ్‌లో ఉండనున్నారు. కోర్టు తీర్పుతో కేజ్రీ, ఆమ్ ఆద్మీ పార్టీకి షాక్ తగిలినట్లైంది. కేజ్రీవాల్‌ని మరి కాసేపట్లో తీహార్ జైలుకు తరలించనున్నారు. అరవింద్ కేజ్రీవాల్‌ను వెంటనే జైలు నుంచి విడుదల చేయాలని బీజేపీని ఆమ్ ఆద్మీ పార్టీ డిమాండ్ చేసింది. ఇందులో భాగంగా శనివారం ఢిల్లీలోని దిన్ దయాళ్ ఉపాధ్యాయ మార్గ్‌లోని బీజేపీ కేంద్ర కార్యాలయం ఎదుట ఆప్ పార్టీ శ్రేణులు ఆందోళన చేపట్టాయి. ఆ క్రమంలో బీజేపీకి వ్యతిరేకంగానినాదాలు చేశాయి. కేంద్ర ప్రభుత్వ సంస్థల దుర్వినియోగం, నియంత పాలన అంతం.. కోసం అంటూ పార్టీ శ్రేణులు ప్లకార్డులను ప్రదర్శించాయి. మరోవైపు బీజేపీ కేంద్ర కార్యాలయం వద్ద అనుమతి లేదంటూ ఆప్‌కి చెందిన ఆందోళనకారులను పోలీసులు నిలిపివేసే ప్రయత్నం చేశారు. ఆ క్రమంలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి.

## సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ వ్యయం పెంపు

(మొదటి పేజీ తరువాయి..)

నిర్వహించాలని సీఎం ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా యుద్ధప్రాతిపదికన హాస్పిటల్ నిర్మాణం పూర్తి చేయాల్సిందేనని నిర్మాణ సంస్థకు తేల్చి చెప్పారు. హైదరాబాద్‌తో పాటు సమానంగా వరంగల్‌ను అభివృద్ధి చేయాలన్నారు సీఎం రేవంత్ రెడ్డి. హెరిటేజ్ సిటీగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వరంగల్ పర్యటనలో భాగంగా హనుమకొండ కలెక్టరేట్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్డుకు సంబంధించి భూసేకరణ పూర్తి చేయాలని అధికారులకు సీఎం సూచించారు. ఆస్పత్రి విసయంలో మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా అంచనా వ్యయం పెంచడమేంటని ఆయన మండిపడ్డారు. నిర్మాణ వ్యయంపై పూర్తిస్థాయి ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా యుద్ధప్రాతిపదికన హాస్పిటల్ నిర్మాణం పూర్తి చేయాల్సిందేనని సీఎం తేల్చి చెప్పారు.

## మహిళలకు ఆర్థిక చేయూత

(మొదటి పేజీ తరువాయి..)

చేస్తోంది. ప్రభుత్వ నిర్ణయంతో గ్రామీణ ప్రజలకు మీ సేవ ద్వారా ఆన్‌లైన్ సేవలు అందడంతో పాటు వాటి నిర్వహణ ద్వారా మహిళా సంఘాలు కూడా ఆర్థికంగా లాభం పొందనున్నాయి. ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా 4525 మీసేవ కేంద్రాలు ఉన్నాయి. అయితే వీటిలో మూడు వేల వరకు పట్టణ, నగర ప్రాంతాల్లోనే ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో తక్కువగా ఉన్నాయి. పన్నెండు వేలకుపైగా పంచాయతీలు ఉంటే.. వెయ్యి గ్రామాల్లోనే మీ సేవ కేంద్రాలున్నాయి. ఈ సేవ కేంద్రాలు అందుబాటులో లేకపోవడం వల్ల చిన్న పనులకు కూడా ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సి వస్తోంది. ఈ పరిస్థితిని గమనించిన తెలంగాణ ప్రభుత్వం మహిళా సంఘాలకు వీటిని కేటాయించాలని నిర్ణయించింది. గ్రామాల్లో మీ సేవ కేంద్రాలు పెట్టుకునేందుకు స్వయం సహాయ సంఘాలకు రెండున్నర లక్షల వరకూ రుణం మంజూరు చేయనున్నారు. ఈ ధనంతో ఈ సేవ కేంద్రాలకు అవసరమైన సాంకేతిక పరికరాలను కేటాయిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లోనే ఏర్పాటు చేస్తారు కాబట్టి.. ఆ కేంద్రాలకు అవసరమైన స్థలం కూడా ప్రభుత్వ భవనాలలోనే లభ్యతను బట్టి కేటాయించే అవకాశం ఉంది. ఇంటర్ పాసైన వారిని ఆపరేటర్లుగా పని చేసేందుకు శిక్షణ ఇప్పిస్తారు. మీ సేవ అధికారుల పర్యవేక్షణలో ఇవి పని చేస్తాయి. మీ సేవ కేంద్రాల ఏర్పాటుకు ముందుకొచ్చే సంఘాలను ఎంపిక చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ప్రభుత్వం తాజాగా ఆదేశించింది.

## కాంగ్రెస్ సీనియర్ నేత
# డీఎస్ కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి..)



పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో ఢిల్లీలో ఉన్న ఆయన కుమారుడు, నిజామాబాద్ ఎంపీ అర్వింద్ మధ్యాహ్నానికి హైదరాబాద్ చేరుకున్నారు. అనంతరం డీఎస్ భౌతిక కాయాన్ని ప్రజలు, అభిమానుల సందర్శనార్థం నిజామాబాద్‌కు తరలించున్నారు. డీఎస్ మృతిపట్ల పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తంచేశారు. మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వీ హనుమంతరావు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. డీఎస్ భౌతికకాయానికి నివాళులర్పించారు. బిఆర్ఎస్ నేత కెటిఆర్, తదితరులు డిఎస్ ఇంటికి వెళ్లి నివాళి అర్పించారు.

**కెసిఆర్ సంతాపం..:** మాజీ మంత్రి డి శ్రీనివాస్ మరణం పట్ల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సంతాపం ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు శనివారం తెల్లవారుజామున 3 గంటలకు హైదరాబాద్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. గుండెపోటుతో చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో మంత్రిగా, పీసీసీ అధ్యక్షుడిగా ఆయన పనిచేశారు. 2004, 2009లో మంత్రిగా సేవలందించారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డికి అత్యంత సన్నిహితులుగా ఉన్నారు. ఆయన పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నసమయంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. అంతా ఆయనను డీఎస్ అని పిలిచేవారు. ప్రస్తుతం ఆయన మృతదేహాన్ని జూబ్లీహిల్స్‌లోని ఆయన ఇంట్లోనే ఉంచారు. సాయంత్రం నిజామాబాద్ ప్రగతినగర్‌లోని ఆయన నివాసానికి పార్థీవదేహాన్ని తరలించనున్నారు. డీఎస్ అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నారు.

**నివాళి అర్పించిన వెంకయ్య..:** డీఎస్ రాజకీయాలకు అతీతమైన వ్యక్తి అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కొనియాడారు. డీఎస్ పార్థివ దేహానికి ఆయన నివాళి అర్పించారు. మిత్రులు డి.శ్రీనివాస్ మృతి చెందారని తెలిసి చాలా బాధపడ్డానన్నారు. ఎంతో అనుభవం ఉన్న నాయకుడిని ప్రజలు కోల్పోయారనినారు. ఆనాటి రాజకీయ నేతల్లో మంచి వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి డీఎస్ అని అన్నారు. ఏ మాత్రం గర్వం లేకుండా అందర్నీ కలుపుకుపోయేవారన్నారు. డీఎస్ కుటుంబంతో తనకు మంచి అనుబంధం ఉందన్న వెంకయ్యనాయుడు.. డీఎస్ కుటుంబ సభ్యులకు తన ప్రగాడ సానుభూతి తెలిపారు. ప్రస్తుతం ఆయన భౌతికకాయాన్ని జూబ్లీహిల్స్‌లోని ఆయన ఇంట్లో ఉంచారు. ప్రస్తుతం ఆయనను చూసేందుకు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు తరలివస్తున్నారు. సాయంత్రం ఆయన భౌతికకాయాన్ని నిజామాబాద్‌లోని ప్రగతినగర్‌లోని ఆయన నివాసానికి తరలించనున్నట్లు సమాచారం. ఆదివారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. అయితే.. డి.శ్రీనివాస్ మృతి పట్ల రాజకీయ ప్రముఖులు సంతాపం తెలుపుతున్నారు. టీపీసీసీ తరుపున డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు నివాళులు అర్పించారు. డీఎస్ పార్థీవదేహంపైన కాంగ్రెస్ పార్టీ జెండా కప్పిన భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబులు నివాళులు అర్పించారు. నిజామాబాద్ కు డీఎస్ పార్థివదేహం తరలించనున్నట్లు సమాచారం. శ్రీనివాస్ 1948 సెప్టెంబర్ 27న నిజామాబాద్ జిల్లాలో జన్మించాడు. నిజాం కాలేజీలో డిగ్రీ పూర్తి చేశాడు. ఆ తర్వాత రాజకీయాల్లోకి వచ్చి కాంగ్రెస్ పార్టీలో అంచెలంచెలుగా ఎదిగారు. 1989లో కాంగ్రెస్ పార్టీ తరపున రంగంలోకి దిగి నిజామాబాద్ అర్బన్ నుంచి తొలిసారిగా అసెంబ్లీకి ఎన్నికయ్యారు. తర్వాత 1999, 2004లో ఎమ్మెల్యేగా గెలిచి.. 1998లో ఉమ్మడి ఏపీ పీసీసీ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. డీఎస్ అంత్యక్రియలు రేపు నిజామాబాద్‌లో అధికారిక లాంఛనాలతో జరపాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. అంత్యక్రియలకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని సీఎస్ శాంతికుమారికి ఆదేశాలు జారీ చేశారు. డీఎస్ పార్థివ దేహాన్ని ఇవాళ సాయంత్రం నిజామాబాద్‌లోని స్వగ్రామానికి తరలించనున్నారు. అభిమానుల సందర్శనార్థం నిజామాబాద్ బైపాస్ రోడ్డులోని స్థలంలో అంత్యక్రియలు చేయనున్నారు.

## ఆదిలాబాద్ మాజీ ఎంపీ రామేశ్ రాథోడ్ హఠాన్మరణం

(మొదటి పేజీ తరువాయి..)

ఆయన భౌతికకాయాన్ని ఉట్నూర్‌కు తరలించారు. రమేష్ రాథోడ్ మృతి పట్ల పలువురు నేతలు సంతాపం ప్రకటించారు. తెదేపా తరఫున 1999లో ఖానాపూర్ ఎమ్మెల్యేగా రమేష్ రాథోడ్ ఎన్నికయ్యారు. 2009లో ఆ పార్టీ నుంచి ఆదిలాబాద్ ఎంపీగా గెలుపొందారు. తెలంగాణ ఉద్యమంలో భాగంగా తెదేపా నుంచి భారాసలో చేరారు. అనంతర పరిణామాల్లో కాంగ్రెస్‌లో చేరి 2019లో ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత భాజపాలోకి వెళ్లారు. ఎంపీ టికెట్ కోసం ప్రయత్నించారు. ఆయన వయస్సు 58 సంవత్సరాలు. శనివారం ఉదయం ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ తరలిస్తుండగా.. మార్గమధ్యంలో ఆయన మరణించారు. శుక్రవారం రాత్రి రమేష్ రాథోడ్ అనారోగ్యానికి గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి ఆయన్ని తరలించారు. అయితే శనివారం ఉదయం మెరుగైన వైద్య చికిత్స కోసం కుటుంబ సభ్యులు ఆయన్ని హైదరాబాద్‌కు తరలించారు. ఆ క్రమంలో ఆయన మృతి చెందారు. ఖానాపూర్ ఎమ్మెల్యేగా, జిల్లా పరిషత్ చైర్మన్‌గానే కాకుండా లోక్‌సభ సభ్యుడిగా రమేష్ రాథోడ్ పని చేశారు. తెలుగుదేశం, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీల్లో రమేశ్ రాథోడ్ కీలక నేతగా పని చేశారు. ఆయన స్వస్థలం నార్నూర్ మండలం తాడిహాత్నూర్. రాతోడ్ మృతికి సిఎం రేవంత్ రెడ్డి సంతాపం ప్రకటించారు. ఆయన మృతి తెలంగాణకు తీరని లోటని అన్నారు. నిబద్ధత కలిగిన రాజకీయ నేత అని అన్నారు. మాజీ ఎంపీ, బీజేపీ సీనియర్ నాయకుడు రమేశ్ రాథోడ్ మృతిపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి దిగ్భాం÷-రతి వ్యక్తం చేశారు.

## హెరిటేజ్ సిటీగా వరంగల్ అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి..)

హెరిటేజ్ సిటీగా తీర్చిదిద్దటానికి ప్రణాళిక రూపొందించాలన్నారు. ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్డుకు భూసేకరణ పూర్తి చేయాలని, దానికి అవసరమైన నిధుల వివరాలు ప్రభుత్వానికి అందించాలని ఆదేశించారు. హైవేలను అనుసంధానిస్తూ వరంగల్ ఔటర్ రింగ్‌రోడ్డు ఉండేలా చూడాలన్నారు. ఓఆర్ఆర్ నుంచి టెక్స్‌టైల్ పార్కును అనుసంధానించాలని చెప్పారు. స్మార్ట్‌సిటీలో భాగంగా భూగర్భ డ్రైనేజీ అభివృద్ధి చేయాలని, నాలాలు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని సూచించిన ఆయన.. డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. హెరిటేజ్ సిటీగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హన్మకొండ కలెక్టరేట్‌లో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు అభివృద్ధి పనుల పురోగతి, చేపట్టాల్సిన పనులపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సీఎం సమీక్షిస్తున్నారు. నగరాభివృద్ధికి సంబంధించి ఇన్‌చార్జి మంత్రి ప్రతీ 20రోజులకోసారి సమీక్ష నిర్వహించాలని అన్నారు. మామునూరు ఎయిర్ పోర్ట్‌పై సైతం సమీక్షించారు. మంత్రులు సీతక్క, కొండా సురేఖలతో పాటు సీఎస్ శాంతికుమారి,డీజీపీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ హైదరాబాద్‌తో సమానంగా వరంగల్‌ను అభివృద్ధి చేయాలన్నారు. ఇన్నర్, ఔటర్‌రింగ్ రోడ్డుకు సంబంధించి భూసేకరణ పూర్తి చేయాలని సూచించారు. భూసేకరణకు అవసరమయ్యే నిధులకు సంబంధించి పూర్తి వివరాలు అందించాలని ఆదేశించారు. నేషనల్ హైవే నుంచి నేషనల్ హైవేకు కనెక్ట్ అయ్యేలా ఔటర్ రింగ్ రోడ్డు ఉండాలని చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి టెక్స్‌టైల్ పార్క్‌కు కనెక్టివిటీ ఉండేలా రోడ్డుమార్గం ఉండేలా చూడాలన్నారు.

# జగజ్జేత భారత్



(మొదటి పేజీ తరువాయి..)

ఉత్కంఠభరితంగా ముగిసిన టీ20 వరల్డ్‌కప ఫైనల్లో భారత్ చాంపియన్‌గా నిలిచింది. శనివారం దక్షిణాఫ్రికాతో జరిగిన ఫైనల్లో రోహిత్ సేన 7 పరుగుల తేడాతో గెలిచింది. దీంతో 2007 తర్వాత మరోసారి ఈ మెగా టోర్నీని కైవసం చేసుకున్నట్టయ్యింది. అలాగే 2011 తర్వాత ఏ ఫార్మాట్‌లోనైనా జట్టుకిదే తొలి వరల్డ్‌కప్. అటు మొదటిసారి ఐసీసీ టోర్నీలో ఫైనల్‌కు చేరిన దక్షిణాఫ్రికా విజయం అంచులవరకు వచ్చినా చివర్లో మ్యాచ్‌ను చేజార్చుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 176 పరుగులు చేసింది. విరాట్ కోహ్లీ (59 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 76), అక్షర్ పటేల్ (31 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్సర్లతో 47), శివమ్ దూబే (16 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 27) రాణించారు. కేశవ్, నోకియాలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 8 వికెట్లకు 169 పరుగులు చేసి ఓడింది. క్లాసెన్ (27 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 52), స్టబ్స్ (31), డికాక్ (39), మిల్లర్ (21) రాణించారు. హార్దిక్‌కు మూడు.. బుమ్రా, అర్ష్‌దీపలకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా విరాట్, ప్లేయర్ ఆఫ్ ద సిరీసగా బుమ్రా నిలిచారు.

**చివర్లో పేసర్ల కట్టడి:** ఓ మాదిరి ఛేదనలో సఫారీలు క్లాసెన్, స్టబ్స్ ధాటికి విజయం వైపు సాగినా.. డెత్ ఓవర్లలో బుమ్రా, హార్దిక్ ధాటికి పూర్తిగా తేలిపోయారు. రెండో ఓవర్‌లో బుమ్రా కళ్లు చెదిరే బంతితో ఓపెనర్ హెన్‌డ్రిక్స్ (4)ను బౌల్డ్ చేయగా.. ఆ వెంటనే కెప్టెన్ మార్‌క్రమ్ (4)ను అర్ష్‌దీప్ వెనక్కి పంపాడు. 12 రన్స్‌కే రెండు వికెట్లు కోల్పోయిన దశలో ఓపెనర్ డికాక్‌కు స్టబ్స్ జత కలిశాడు. మరో ఆరు ఓవర్ల పాటు ఈ జోడీ భారత బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొంది. కనీసం ఓ బౌండరీ ఉండేలా చూసిన వీరు స్కోరును సైతం పది పరుగుల రన్‌రేట్‌తో పరిగెత్తించారు. అయితే తొమ్మిదో ఓవర్‌లో స్వీప్ షాట్ కోసం వెళ్లి స్టబ్స్ బౌల్డయ్యాడు. అక్షర్ ఈ వికెట్ తీయడంతో మూడో వికెట్‌కు 58 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కాసేపటికే డికాక్‌ను అర్ష్‌దీప్ అవుట్ చేయడంతో మ్యాచ్ ఇరువైపులా మొగ్గు చూపింది. కానీ క్రీజులో హిట్టర్లు క్లాసెన్, మిల్లర్ ఉండడంతో పరుగుల వేటలో ఇబ్బంది పడలేదు.

స్పిన్నర్లు అక్షర్, కుల్దీపను లక్ష్యంగా చేసుకున్నారు. 14వ ఓవర్‌లో మిల్లర్ 4,6తో 14 రన్స్ రాబట్టగా.. 15వ ఓవర్‌లో క్లాసెన్ ఏకంగా 4,6,6,4తో 24 పరుగులు సమకూర్చడంతో సమీకరణం 30 బంతుల్లో 30 రన్స్‌కు మారింది. ఒక్కసారిగా మ్యాచ్ సఫారీల వైపు మొగ్గినట్టు కనిపించడంతో భారత్‌లో ఆందోళన నెలకొంది. అయితే చివరి నాలుగు ఓవర్లలో భారత బౌలర్లు చెలరేగారు. 16వ ఓవర్‌లో బుమ్రా 4 పరుగులే ఇవ్వగా.. 17వ ఓవర్‌లోనూ పాండ్యా నాలుగు పరుగులే ఇచ్చి ప్రమాదకర క్లాసెన్ వికెట్ తీయడంతో భారత్ శిబిరంలో సంబరాలు నెలకొన్నాయి. ఐదో వికెట్‌కు ఈ జోడీ 22 బంతుల్లోనే 45 పరుగులు జత చేసింది. ఓ సూపర్ ఇన్‌స్వింగర్‌కు జాన్సెన్ (2) వికెట్ తీసిన బుమ్రా 18వ ఓవర్‌లో 2 పరుగులే ఇచ్చాడు. ఈ దశలో 12 బంతుల్లో 20 రన్స్ కావాల్సి రావడంతో సఫారీలు ఒత్తిడిలో పడ్డారు. మిల్లర్ క్రీజులో ఉన్నా షాట్లు ఆడలేకపోయాడు. ఇక ఆఖరి ఓవర్‌లో 16 పరుగులు అవసరమయ్యాయి. హార్దిక్ వేసిన వైడ్ ఫుల్ టాస్‌ను మిల్లర్ భారీ సిక్సర్‌గా మలిచే ప్రయత్నంలో సూర్య సూపర్ క్యాచ్‌తో వెనుదిరిగాడు. రబాడ (4) ఓ ఫోర్ సాధించినా ఐదో బంతికీ తను అవుటయ్యాడు. దీంతో భారత్ సంబరాలు ఆకాశాన్నంటాయి.

**విరాట్-అక్షర్ నిలబెట్టారు..**

బంతి నేరుగా బ్యాట్‌పైకి వస్తుందన్న అంచనాతో టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్ ఎంచుకుంది. కానీ ఆరంభంలో బౌలర్లకు పట్టు లభించడంతో 34 పరుగులకే రోహిత్ (9), పంత్ (0), సూర్యకుమార్ (3)ల వికెట్లను కోల్పోయిన జట్టు షాక్‌కు గురైంది. కానీ పేలవ ఫామ్‌తో నిరాశపరుస్తున్న విరాట్ కోహ్లీ విలువైన ఇన్నింగ్స్‌తో అండగా నిలవగా.. హిట్టర్ పాత్రలో అక్షర్ సహకరించాడు. దీంతో సఫారీల ముందు జట్టు సవాల్ విసిరే స్కోరును ఉంచింది. రెండో ఓవర్‌లోనే స్పిన్నర్ కేశవ్ మహరాజ్.. రోహిత్, పంత్‌ల వికెట్లు తీశాడు. ఇక ఐదో ఓవర్‌లో సూర్యను రబాడ కట్టడి చేశాడు. వాస్తవానికి తొలి ఓవర్‌లోనే కోహ్లీ మూడు ఫోర్లతో 15 రన్స్ అందించి జోష్‌ను నింపినా.. ఆ తర్వాత వికెట్ల పతనంతో అతడితో పాటు అక్షర్ జాగ్రత్తగా ఆడాల్సి వచ్చింది. మధ్య ఓవర్లలో పేసర్లు జాన్సెన్, నోకియా రన్స్‌ను నియంత్రించారు. అయితే అడపాదడపా అక్షర్ సిక్సర్లతో స్కోరులో కాస్త కదలిక కనిపించింది. కానీ 14వ ఓవర్‌లో లేని పరుగు కోసం వెళ్లిన అక్షర్ దురదృష్టవశాత్తు రనౌటయ్యాడు. దీంతో నాలుగో వికెట్‌కు 72 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. వచ్చీ రాగానే దూబే సిక్సర్‌తో ఆకట్టుకోగా.. అటు నెమ్మదిగా ఆడుతూ వచ్చిన విరాట్ 48 బంతుల్లో ఫిఫ్టీ పూర్తయ్యాక జోరు పెంచాడు. 18వ ఓవర్‌లో 6,4తో 16 రన్స్ రాగా.. తర్వాతి ఓవర్‌లో 4,2,6తో 12 రన్స్ అందించి జాన్సెన్‌కు చిక్కాడు. అప్పటికే దూబేతో కలిసి ఐదో వికెట్‌కు 33 బంతుల్లో 57 పరుగులు జత చేశాడు. అయితే చివరి ఓవర్‌లో దూబే, జడేజా (2) వికెట్లను తీసిన నోకియా 9 పరుగులే ఇవ్వడంతో భారత స్కోరు 180లోపే ముగిసింది.

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అనూహ్య నిర్ణయం తీసుకున్నాడు. భారత జట్టు విశ్వవిజేతగా ఆవిర్భవించి దేశ క్రికెట్ ఫ్యాన్స్ అంతా ఆనందోత్సాహాల్లో మునిగిన వేళ.. 35 ఏళ్ల విరాట్ ఊహించని నిర్ణయం తీసుకున్నాడు. అంతర్జాతీయ టీ20ల నుంచి తక్షణమే వైదొలుగుతున్నట్టు ప్రపంచ కప్ ఫైనల్ ముగిసిన క్షణాన ప్రకటించాడు. 59 బంతుల్లో 76 పరుగులు చేసి టీమిండియా విజయంలో అత్యంత కీలక పాత్ర పోషించిన కోహ్లీ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్న సంగతి తెలిసిందే. 'నేను ఆశించింది ఈ వరల్డ్ కప్పే. అది అందుకున్నా. దాంతో ఇదే నా చివరి మ్యాచ్' అని అవార్డుల ప్రదాన కార్యక్రమానికి ముందు మాట్లాడుతూ విరాట్ వెల్లడించాడు. 'మనం పరుగులు సాధించలేమని భావించే రోజు ఒకటి వస్తుంది. భగవంతుడు గొప్పవాడు. రిటైర్మెంట్ ప్రకటించడానికి ఇంతకు మించిన తరుణం లేదు' అని కోహ్లీ అన్నాడు.

**డబ్బే డబ్బు..**

**మొత్తం ప్రైజ్‌మనీ:** రూ.93.78 కోట్లు
**చాంపియన్‌కు :** రూ.20.42 కోట్లు
**రన్నరప్‌కు :** రూ.10.67 కోట్లు
**సెమీస్‌లో ఓడిన జట్టుకు :** రూ.6.56 కోట్లు
**సూపర్-8 పరాజితులకు :** రూ.3.18 కోట్లు
**9-12వ స్థానం జట్లకు :** రూ.2.06 కోట్లు
**13-20వ స్థానం జట్లకు:** రూ.1.87 కోట్లు
**ఒక్కో మ్యాచ్‌కు:** రూ.25.97లక్షలు

**స్కోరుబోర్డు..**

**భారత్:** రోహిత్ (సి) క్లాసెన్ (బి) మహరాజ్ 9, విరాట్ (సి) రబాడ (బి) జాన్సెన్ 76, పంత్ (సి) డికాక్ (బి) మహరాజ్ 0, సూర్యకుమార్ (సి) క్లాసెన్ (బి) రబాడ 3, అక్షర్ (రనౌట్) డికాక్ 47, దూబే (సి) మిల్లర్ (బి) నోకియా 27, హార్దిక్ (నాటౌట్) 5, జడేజా (సి) మహరాజ్ (బి) నోకియా 2, ఎక్స్‌ట్రాలు: 7, మొత్తం: 20 ఓవర్లలో 176/7బీ వికెట్ల పతనం: 1-23, 2-23, 3-34, 4-106, 5-163, 6-174, 7-176బీ బౌలింగ్: జాన్సెన్ 4-0-49-1, మహరాజ్ 3-0-23-2, రబాడ 4-0-36-1, మార్‌క్రమ్ 2-0-16-0, నోకియా 4-0-26-2, షంసి 3-0-26-0.

**దక్షిణాఫ్రికా:** హెన్‌డ్రిక్స్ (బి) బుమ్రా 4, డికాక్ (సి) కుల్దీప్ (బి) అర్ష్‌దీప్ 39, మార్‌క్రమ్ (సి) పంత్ (బి) అర్ష్‌దీప్ 4, స్టబ్స్ (బి) అక్షర్ 31, క్లాసెన్ (సి) పంత్ (బి) హార్దిక్ 52, మిల్లర్ (సి) సూర్య (బి) హార్దిక్ 21, జాన్సెన్ (బి) బుమ్రా 2, మహరాజ్ (నాటౌట్) 2, రబాడ (సి) సూర్య (బి) హార్దిక్ 4, నోకియా (నాటౌట్) 1, ఎక్స్‌ట్రాలు: 9, మొత్తం: 20 ఓవర్లలో 169/8బీ వికెట్ల పతనం: 1-7, 2-12, 3-70, 4-106, 5-151, 6-156, 7-161, 8-168బీ బౌలింగ్: అర్ష్‌దీప్ 4-0-20-2, బుమ్రా 4-0-18-2, అక్షర్ 4-0-49-1, కుల్దీప్ 4-0-45-0, హార్దిక్ 3-0-20-3, జడేజా 1-0-12-0.

నేటి ఫోకస్ న్యూస్









# నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

- రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క
- మెడికల్ కళాశాల, సమీకృత కలెక్టరేట్ కార్యాలయ నిర్మాణ పనుల పరిశీలన
- నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలి




**ములుగు, (నేటి ఫోకస్ న్యూస్)-జూన్ 29:** జిల్లాలో నూతనంగా నిర్మిస్తున్న మెడికల్ కళాశాల సమీకృత కలెక్టరేట్ కార్యాలయ నిర్మాణ పనులలో వేగం పెంచాలని రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం మంత్రి అనసూయ సీతక్క జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ తో కలిసి నూతనంగా నిర్మిస్తున్న మెడికల్ కళాశాల,సమీకృత కలెక్టరేట్ కార్యాలయ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నిర్మాణ పనులలో వేగం పెంచాలని అవసరమైతే అదనపు వర్కర్స్ తో పనులు చేయించాలని నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీకృత కలెక్టరేట్ కార్యాలయం నిర్మాణ పనులు డిసెంబర్ మాసంలోపు పూర్తి చేసి అధికారులకు అందించాలని , నూతన కలెక్టరేట్ వచ్చే రహదారి కూడా వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నూతనంగా మెడికల్ కళాశాల లో ఎన్ని కోర్స్ లు అందుబాటులో ఉంటాయి, ఎంత మంది విద్యార్థులు వచ్చే అవకాశం ఉంది,వారికి అందించే సదుపాయాలు ఎలా ఉంటాయి అనే తదితర అంశాలను వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మోహన్ లాల్ , ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ జగదీశ్వర్ ఆర్ అండ్ బి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరవ వార్డులో సమస్యలు పరిష్కరించండి

- 6వ వార్డు కౌన్సిలర్ కంచరవి



**వనపర్తి ప్రతినిధి, నేటి ఫోకస్ న్యూస్:** వనపర్తి మున్సిపల్ పరిధిలోని ఆరవ వార్డులో నెల కొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని మునిసిపల్ అధికారులను స్థానిక కౌన్సిలర్ కంచరవి కోరారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ మహేష్ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన పలు సమస్యలను లేవనెత్తారు. మెట్టుపల్లి మెయిన్ రోడ్డు వెంబడి రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ పూర్తయినందున వెంటనే కరెంట్ స్తంభాలు షిఫ్టింగ్ చేసి నూతన లైన్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ ను కోరారు. అలాగే జిల్లా కేంద్రంలో గత ప్రభుత్వంలో నిర్మించిన టౌన్ హాల్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను ప్రజలకు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు.



## బెస్ట్ అవైలబుల్ స్కీమ్ పేద విద్యార్థులకు గొప్ప వరం

- బెస్ట్ అవైలబుల్ స్కూల్‌కు ఎంపికైన 15 మంది విద్యార్థులు
- విద్యార్థులు తల్లిదండ్రులకు నియామక పత్రాలను అందిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ పి.యాదయ్య
- ఆల్ ఇండియా షెడ్యూల్ క్యాస్ట్ రైట్ ప్రొటెక్షన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ, దళిత రత్న అవార్డు గ్రహీత, దర్గా రవికుమార్

**ఫోకస్ న్యూస్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ జూన్ 29:** రాష్ట్ర ప్రభుత్వం దళిత పేద విద్యార్థులకు ప్రతి సంవత్సరం ఒకటో తరగతి నుండి పదవ తరగతి వరకు బెస్ట్ అవైలబుల్ స్కీం ద్వారా ఉచిత విద్య అందించడం అభినందనీయమని, ఆల్ ఇండియా షెడ్యూల్ క్యాస్ట్ రైట్ ప్రొటెక్షన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ, దళిత రత్న అవార్డు గ్రహీత, దర్గా రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024, 25 సంవత్సరంలో బెస్ట్ అవైలబుల్ స్కూల్‌కి ఎంపికైన విద్యార్థుల తల్లిదండ్రులకు, హైదరాబాద్ జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ పి. యాదయ్య చేతుల మీదుగా నియామక పత్రాలను అందించడం జరిగిందని తెలిపారు. సికింద్రాబాద్ పరిధిలోని 15 మంది విద్యార్థులు, హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా 140 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్ ఎమ్మార్పీఎస్ నాయకులు కర్నాల నందకిషోర్, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జ్వాలా



**తొర్రూర్, (నేటి ఫోకస్ న్యూస్)-జూన్ 29:** మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ సింగ్ ఆదేశాల మేరకు మెడికల్ డిపార్ట్మెంట్, పంచాయతీ రాజ్, ఏపీఎమ్ఓ, అంగన్వాడి డిపార్ట్మెంట్ లతో కలిపి గ్రామ గ్రామాన మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామని తొర్రూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జ్వాలా తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికీ 500 డెంగు కేసులు వచ్చాయన్నారు. వర్షాకాలంలో వచ్చే డెంగు మలేరియా, ఫ్యూవర్ అతిసార వ్యాధుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని గ్రామ గ్రామాన మెడికల్ క్యాంపుల ద్వారా అవగాహన కల్పిస్తూ మలేరియా డెంగు టెస్టులను నిర్వహిస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా దోమలు ఎక్కువగా పెరగడం వలన ఇంటి ముందు నీటి నిల్వలు ఉండకుండా ఎప్పుడు అవసరం ఉంటే అప్పటికప్పుడే నీటిని విరివిగా వాడుకోవాలన్నారు. ఇప్పుడు వచ్చే కేసులన్నీ డెంగు మలేరియా, ఫ్యూవర్ అతిసార వ్యాధికి సంబంధించిన కేసులేనని, ఇవి అధికంగా ప్రభలే అవకాశం ఉన్నందున ప్రజలంతా త్రాగునీరు కాచి చల్లార్చి వడపోసినన నీటిని వాడుకోవాలని కోరారు. ఈ నెలలోనే 22 పాముకాటు, 31 తేలుకాటు, 156 కుక్క కాటు కేసులు వచ్చాయని తెలిపారు. గ్రామ గ్రామాన సర్వేలు కూడా నిర్వహిస్తున్నామన్నారు.






## ఆశ్రమ పాఠశాలలను సందర్శించిన డిటిడిఓ

- విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవ్..: డిటిడిఓ కమలాకర్ రెడ్డి

**ఉమ్మడి మహబూబ్నగర్ ప్రతినిధి, (నేటి ఫోకస్‌న్యూస్)-చారగొండ వెంకటేష్ జూన్ 29:** జిల్లాలో ఆశ్రమ పాఠశాలలా పనితీరు ఏ విధంగా ఉంది అన్న విషయంపై డిటిడిఓ కమలాకర్ రెడ్డి ప్రత్యేకంగా నిఘా పెట్టాడు. శనివారం మన్ననూర్ బాలుర ఎస్టి వసతి గృహాన్ని డిటిడిఓ కమలాకర్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు ఎలాంటి మౌలిక వసతులు కల్పిస్తున్నారు, విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెడుతున్నారా లేదా అన్న విషయంపై సంపూర్ణంగా దగ్గరుండి చూశారు. అదేవిధంగా పాఠశాల పరిసర ప్రాంతాలను సందర్శించి, విద్యార్థులకు పరిశుభ్రత విషయంలో సంబంధిత వార్డెన్ పర్యవేక్షణ ఉండాలన్నారు. తధానంతరం విద్యార్థుల హాజరు రికార్డులను పరిశీలించారు. అక్కడినుండి అచ్చంపేట పట్టణంలో ఉన్న ఆశ్రమ పాఠశాలను సందర్శించి ప్రధానోపాధ్యాయునితో హాస్టల్ స్థితిగతుల గురించి అడిగి తెలుసుకున్నారు. పలు వసతి గృహాలలో టిటిడిఓ స్టోర్ గదుల్లోకి వెళ్లి గోదాంలో స్టాక్ నిల్వలను అడిగి తెలుసుకున్నారు. వంట గదులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థుల మెనో విషయంలో నిర్లక్ష్యం చర్యలు తీసుకోక తప్పదని ఘాటుగా హెచ్చరించారు. విద్యార్థులతో మాట్లాడి... నాణ్యమైన భోజనం పెడుతున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుండి కాలేజీ హాస్టల్ ను సందర్శించారు. విద్యార్థుల పట్ల ఎవరైనా వార్డెన్లు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఘాటుగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ డబ్ల్యు ఓ రాజేందర్, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





## దండు మారెమ్మ దేవాలయ కమాన్ పునర్నిర్మాణనికి సహకరించిన బోర్డు అధికారులకు ధన్యవాదాలు

- గత 30 సంవత్సరాలు క్రితం గోపాల్ తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా కమాన్ నిర్మించారు.
- మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, దేవాలయ ధర్మకర్త ముప్పిడి గోపాల్

**ఫోకస్ న్యూస్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ జూన్ 29:** కంటోన్మెంట్ నియోజకవర్గ మూడో వార్డులోని శ్రీశ్రీశ్రీ దేవి దండు మారెమ్మ దేవాలయం కమాన్, గతంలో లారీ, బస్సు ల వలన డ్యామేజ్ అయిన కమాన్ కు, పునర్నిర్మాణ సహకారం అందించినందుకు, సి.ఈ.ఓ మధుకర్ నాయక్ కు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, దండు మారెమ్మ దేవాలయ ధర్మకర్త ముప్పిడి గోపాల్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ముప్పిడి గోపాల్ మాట్లాడుతూ... గత 30 సంవత్సరాల క్రితం దండు మారెమ్మ కమాన్ ను వారి తల్లిదండ్రులు ముప్పిడి శ్యామలమ్మ ముత్యాలు, మరియు శ్రీనివాస్ ల జ్ఞాపకార్థంగా కమాన్ నిర్మించడం జరిగిందని తెలిపారు. డ్యామేజీ అయిన కమాన్ కు పునర్నిర్మాణం పనుల కోసం కు బోర్డు సీఈవో సహాయ సహకారాలు అందించినందుకు, శనివారం నాడు ముప్పిడి గోపాల్ ఆధ్వర్యంలో దేవాలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులతో కలిసి సీఈఓ మధుకర్ నాయక్, చీఫ్ ఇంజనీర్ ఫణికుమార్ లను కలిసి, శాలువాతో సన్మానించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళితరత్న అవార్డు గ్రహీత దర్గా రవికుమార్, నరేష్, ట్రస్ట్ మెంబర్ కె. పరమేష్, చిన్న, తదితరులు పాల్గొన్నారు.

## డి.శ్రీనివాస్ మృతి కాంగ్రెస్‌కి తీరని లోటు

- డిఎస్ భౌతికాయానికి నివాళులర్పించిన
- కాంగ్రెస్ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు సునీత రావు
- మేడ్చల్ మల్కాజ్గిరి మహిళా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల నిర్మల్ రెడ్డి






**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్:** ధర్మపురి శ్రీనివాస్ అకాల మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని కాంగ్రెస్ పార్టీ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు సునీత రావు, మేడ్చల్ మల్కాజ్గిరి కాంగ్రెస్ పార్టీ మహిళా ప్రధాన కార్యదర్శి చింతల నిర్మల రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు, ఈ సందర్భంగా డీఎస్ సుదీర్ఘకాలం కాంగ్రెస్ పార్టీ కోసం ఎనలేని సేవలు అందించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పిసిసి అధ్యక్షుడిగా పార్టీ బలోపేతం కోసం తినలేని కృషి చేశారని తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో తనదైన పాత్ర పోషించారని వారు గుర్తుకు చేశారు ఈ సందర్భంగా వారి పవిత్రమైన ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బదిలీపై వేళుతున్న ఏపీజీవీబీ కలకోట బ్రాంచ్ ఫీల్డ్ ఆఫీసర్‌కి ఘన సన్మానం

**(నేటి ఫోకస్ న్యూస్) ప్రతినిధి మాగి ముఖేష్,బోనకల్లు జూన్ 29:** ఖమ్మం జిల్లా బోనకల్ మండలం కలకొట నాగార్జున గ్రామీణ వికాస్ బ్యాంక్ లో 4 సంవత్సరాల పాటు ఫీల్డ్ ఆఫీసర్ గా విధులు నిర్వహించి శనివారం నాడు బదిలీపై వెళు తున్నందున చిరంజీవికి సన్మానం నిర్వహించారు. ఆయన చేసిన సేవలు ఆళ్లపాడు కలకోట మోటమర్రి గ్రామాల రైతులకు ఎంతో నమ్మకమైన సేవలు అందించి రైతులకు నష్టం లేకుండా రుణాలు సకాలంలో అందించి ప్రతి సంవత్సరం ఋణాలు రెన్యూవల్ చేసుకునేందుకు రైతులకు ఒక సిస్టం ప్రకారం తన కర్తవ్యాన్ని నిర్వహించి రైతులకు లాభదాయక మైనవంటి సూచనలు సలహాలు ఇచ్చి బ్యాంకు వద్దకు వెళ్ళిన రైతులకు సకాలంలో పనిచేసి తమ కర్త వ్యాన్ని ఒక బాధ్యత రహితమైన కృషి రైతులకు సేవలు రాత్రి ఉదయం పూటా సభలు నిర్వహించి గ్రామం లో ఇంటింటీకి తిరిగి రైతులకు బదిలీ పై వెళ్లిన మేనేజర్ ప్రదిప్ కుమార్ వేళ్లుతున్న చిరంజీవి లు అవగాహన కల్పించారు.ఆని ఆళ్లపాడు మాజీ సర్పంచులు పారా లక్ష్మి నారాయణ మర్రి తిరుపతి రావు అన్నారు. వారికి బ్రాంచ్ నందు వారికి శాలువాతో సన్మానం చేసి వారి సేవలను గుర్తు చేసారు చిరంజీవి సేవలు రైతులకు ఎంతో అవసరం మని వారు చేసిన సేవలు మరువలేనివి ఆని అన్నారు.వారు ఉన్నత స్థితి నుండి ఉన్నాత స్థాయి కి ఏదగలానీ వారికి అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆళ్లపాడు రైతులు బండి నాగేశ్వరరావు బండి పుల్లయ్య బలగాని నాగరాజు మరీదు సైదులు చిట్టిమొదు నాగేశ్వరరావు నూతనంగా వచ్చిన మేనేజర్ శక్తివేలు క్యాష్ యిర్ జ్యోతి బ్యాంకు సిబ్బంది శ్రీను పాల్గొన్నారు.





## ఆదం జీవితం ప్రజాసేవకు అంకితం

- ఘనంగా ఆదం సంతోష్ జన్మదిన వేడుకలు
- ఆదంకు శుభాకాంక్షలు తెలిపిన దొమ్మాటి శివకుమార్ దంపతులు

**ఫోకస్ న్యూస్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ జూన్ 29:** బడుగు బలహీన వర్గాల పేద ప్రజలకు నేనున్నానంటూ, భరోసా కల్పిస్తున్న, సికింద్రాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆదం సంతోష్ కుమార్ అని, టి.పి.సి.సి లేబర్ సెల్ రాష్ట్ర నాయకుడు దోమ్మాటి శివకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా దోమ్మాటి శివకుమార్ మాట్లాడుతూ... ఆదం సంతోష్ జన్మదిన సందర్భంగా దోమ్మాటి నాగమణి శివకుమార్, మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో ఘనంగా సన్మానించారు. నియోజకవర్గంలో ఎవరికి ఏ ఆపద వచ్చిన నేనున్నానంటూ భరోసా కల్పిస్తూ, అని వర్గాల ప్రజలకు పెద్దన్న పాత్ర వహిస్తున్న ఆదం సంతోష్ ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, వారు కోరారు. భవిష్యత్తులో మరెంతో ఉన్నతమైన స్థానంలో ఉండాలని మనసారా ఆశీర్వదించామని వారు తెలిపారు.

## గుడుంబా స్థావరాలపై దాడులు

**తొర్రూర్, (నేటి ఫోకస్ న్యూస్)-జూన్ 29:** జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తొర్రూర్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని పెద్ద దుబ్బ తండా, భీముడు తండాలో అక్రమంగా గుడుంబా కాస్తున్న స్థావరాలపై ఎస్ఐ కూచిపూడి జగదీష్ పోలీస్ సిబ్బందితో కలిసి దాడులు చేసినట్లు తొర్రూరు సిఐ సంజయ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ దాడులలో 50 లీటర్ల గుడుంబా, 500 లీటర్ల బెల్లం పానకాన్ని స్వాధిన పర్చుకొని నలుగురుపై కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.



# నా పెళ్లికి రండి సర్..

## ప్రధానిని ఆహ్వానించిన శరత్‌కుమార్ ఫ్యామిలీ

**ప్రధాని మోదీని పెళ్లికి** ఆహ్వానించారు నటి వరలక్ష్మీశరత్‌కుమార్. దీనికి సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకున్నారు. గత కొన్ని రోజులుగా వరలక్ష్మి టాలీవుడ్, కోలీవుడ్ ప్రముఖులను తన పెళ్లికి ఆహ్వానిస్తున్నారు. ఇప్పటికే సినీ ప్రముఖులను ఆమె స్వయంగా వెళ్లి పిలిచారు. తాజాగా కుటుంబ సమేతంగా వెళ్లి ప్రధానిని ఆహ్వానించారు. ఈ ఫొటోలను వరలక్ష్మి ఎక్స్‌లో షేర్ చేస్తూ మోదీకి థ్యాంక్స్ చెప్పారు. ప్రధానిని కలవడం ఆనందంగా ఉందన్నారు. ఆయన బిజీ షెడ్యూల్‌లో కూడా తమతో మంచి సమయం గడిపినట్లు తెలిపారు. చాలా గౌరవంగా ఉందన్నారు. ఈ సందర్భంగా శరత్‌కుమార్‌కు కూడా ఆమె ధన్యవాదాలు చెప్పారు. సీనియర్ నటుడు శరత్‌కుమార్ కుమార్తెగా వెండితెరకు పరిచయమైనా తన వైవిధ్యమైన నటన, విలన్ పాత్రలతో వరలక్ష్మి ఆకట్టుకుంటున్నారు. ప్రముఖ గ్యాలరిస్ట్ నికోలయ్ సచ్‌దేవ్‌తో త్వరలోనే పెళ్లి పీట లెక్కబోతున్నారు. దాదాపు ఏడేళ్లు ప్రేమించుకున్న వీళ్లిద్దరూ ఇటీవలే నిశ్చితార్థం చేసుకున్నారు. పెళ్లి సింపుల్‌గా చేసుకుంటున్నా రిసెప్షన్ మాత్రం చెన్నైలో గ్రాండ్‌గా చేసుకోనున్నట్లు తెలుస్తోంది.




# మహాభారత పాత్రల చిత్రీకరణ

## కల్కి సినిమాపై ప్రేక్షకులలో అసహనం..


**సినిమాల్లో కొన్నిసార్లు** లాజిక్ ఉండదు. లాజిక్ లేకుండా కథలు సాగుతాయి. అయితే పురాణాల నుంచి తీసుకున్న కథల విషయంలోనూ ఇదే జరుగుతోంది. కల్కి విషయంలోనూ ఇదే జరిగింది. ఈ సినిమా తీయడానికి తనకి భారతీయ పురాణాలు స్ఫూర్తి అని చెప్పారు దర్శకుడు నాగ్ అశ్విన్ పలు సందర్భాల్లో. ఈ సినిమా కథ మొదలవడం ద్వాపరయుగంలో మహాభారత సంగ్రామం అయిన తరువాత శ్రీకృష్ణుడు, అశ్వద్దామకి శాపం ఇస్తాడు. అలాగే అశ్వద్దామ చేసిన పాపం పోవాలంటే కలియుగంలో కల్కిగా పుడతాను, అప్పుడు నువ్వు ఆ బిడ్డని కాపాడాలి అని కూడా చెప్తాడు కృష్ణుడు. ఇక కథ కలియుగంకి వస్తుంది. దీపికా పదుకోన్ గర్భంలో పెరుగుతున్న బిడ్డ కల్కి అవతారమని అశ్వద్దామ (అమి తాబ్ బచ్చన్) ఆ బిడ్డని కాపాడటానికి సర్వప్రయత్నం చేస్తూ ఉంటాడు. చివర్లో విలన్స్ పైచేయిగా అనిపించినప్పుడు భైరవ పాత్రలో వున్న ప్రభాస్‌ని కర్ణుడిగా చూపించి, అశ్వద్దామకి సహాయం చెయ్యడానికి వస్తాడు. అదే సమయంలో కురుక్షేత్ర యుద్ధంలో కర్ణుడితో యుద్ధం చేస్తున్న అర్జునుడు కర్ణుడు ధాటికి తట్టుకోలేక అతని రథం కొంచెం వెనక్కి వెళుతుంది, ఎందుకంటే కర్ణుడి ప్రభావం తట్టుకోలేక అర్జునుడు వెనకడుగు వేసినట్టుగా చూపిస్తారు. ఈ సినిమా చూసి బయటకి వచ్చిన ప్రేక్షకులకి మాత్రం ఇది మింగుడు పడటం లేదు. ఎందుకంటే కర్ణుడు, అశ్వద్దామ ఎక్కడ స్నేహం కలిపారు, ఏ భారతంలో చెప్పారు? అలాగే అర్జునుడిపై కర్ణుడిని గొప్ప వీరుడుగా చూపించాడు. ఇది కూడా భారతంలో ఎక్కడ వుంది? మరి ఏ పురాణాలు నాగ్ అశ్విన్ చదివారని బయటకి వచ్చిన ప్రేక్షకులు బుర్రలు బద్దలు కొట్టుకుంటున్నారు. మహాభారతంలో కర్ణుడు గొప్ప వీరుడే, కానీ అర్జునుడి కన్నా కాదు. కర్ణుడు ఎంత గొప్ప దానాలు చేసినా, గొప్ప వీరుడైనా అధర్మంవైపు వుండి యుద్ధం చేశాడు. అలాగే అర్జునుడి చేతిలో కురుక్షేత్రం కన్నా ముందు చాలా సార్లు ఓడిపోయాడు. అనేక సందర్భాల్లో కర్ణుడిపై అర్జునుడిదే పైచేయి అవుతుందన్నది మహాభారత కథ.కర్ణుడు ఓడిపోతూ ఉంటాడు, అంతేకానీ కర్ణుడు ఎప్పుడూ గెలవలేకపోయాడు. ఇక కర్ణుడికి గురువైన ద్రోణాచార్యుడుపై కూడా గురుభక్తి లేదు. ఎన్నోసార్లు ద్రోణాచార్యుడుని అధిక్షేపించాడు కర్ణుడు, అశ్వద్దామకి కూడా అందుకే కర్ణుడు అంటే పడదు. కర్ణుడు మాటలు విని దుర్యోధనుడు పాడైపోతున్నాడని అశ్వద్దామ కూడా ఎన్నోసార్లు హెచ్చరించాడు. అందువలన అశ్వద్దామకి, కర్ణుడికి స్నేహం ఎక్కడా వున్నట్టుగా భారతంలో లేదు. అశ్వద్దామకి పాండవులపై కోపం ఎప్పుడు వచ్చిందంటే, తన తండ్రి ద్రోణాచార్యుడని అన్యాయంగా చంపారని అతను భావించాడు. దృష్టద్యుమ్నుడు కత్తితో ద్రోణాచార్యుడు తల నరుకుతాడు, అది చూసి అశ్వద్దామ పగ పెంచుకుంటాడు. అయితే ఎక్కడా కూడా కర్ణుడికి, అశ్వద్దామకి స్నేహం ఉందని మాత్రం చెప్పలేదు. అలాగే అర్జునుడు కన్నా కర్ణుడు ఎందులోనూ సమానుడు కాదు. మరి నాగ్ అశ్విన్ ఎక్కడ పురాణాలూ చదివాడో అర్థం కావటం లేదని ప్రేక్షకులు తలలు పట్టుకుంటున్నారు. అర్జునుడిపై కర్ణుడిని ధీరోదాత్తముగా చూపించడం ప్రేక్షకులకి ఒక పట్టాన మింగుడు పడటం లేదు.




# పూర్తి కావొస్తున్న హరిహర వీరమల్లు

**పవన్ కల్యాణ్ హీరోగా** తెరకెక్కుతున్న పీరియాడికల్ చిత్రం 'హరిహర వీరమల్లు' 'ధర్మం కోసం యుద్ధం' అనేది ఉపశీర్షిక. తొలుత ఈ చిత్రానికి క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం. ఆయన మరో చిత్రంతో బిజీగా ఉండటం వల్ల ఆయన పర్యవేక్షణలో జ్యోతి కృష్ణ సినిమాను పూర్తి చేయనున్నారు. మెగా సూర్య మూవీస్ పతాకంపై ఎ.ఎం.రత్నం ఈ చిత్రాన్ని భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన గ్లింప్స్ టీజర్స్, పోస్టర్స్ విపరీతంగా సినిమాకు హైప్ ఇచ్చాయి. సినిమా ఆగిపోయిందని, షూటింగ్ జరగడం లేదని ఎన్ని ప్రచారాలు జరిగినా సినిమాకు క్రేజ్ మాత్రం తగ్గలేదు. నెగటివ్‌గా పబ్లిసిటీ జరిగిన ప్రతిసారీ చిత్రం బృందం అప్‌డేట్ ఇస్తూనే ఉంది. ఇప్పటికే ఈ చిత్రం 50శాతానికి పైగా చిత్రీకరణ పూర్తయింది. పవన్ కల్యాణ్ చేయాల్సింది 20నుంచి 25రోజులు మాత్రమే. తాజాగా ఈ చిత్రం గురించి నిర్మాత ఎ.ఎంరత్నం లేటెస్ట్ అప్‌డేట్ ఇచ్చారు. ఓ మీడియాతో మాట్లాడిన ఆయన సినిమా విశేషాలను వెల్లడించారు. 'పవన్ కల్యాణ్ షూటింగ్ చాలావరకూ పూర్తయింది. ఇంకో 20-25 రోజులు ఆయన షూటింగ్ చేస్తే సినిమా పూర్తవుతుంది. అది కూడా ఆయన వీలునుబట్టి త్వరలోనే పూర్తి చేసే ప్లాన్ చేస్తున్నారు. అమెజాన్ ఓటీటీ హక్కులు తీసుకుంది. వారి అగ్రిమెంట్ ప్రకారం సినిమా అక్టోబర్‌లో విడుదల కావాలి. వాళ్లని రిక్వెస్ట్ చేసి విడుదల కాస్త వెనక్కి తీసుకెళ్తాం. ఈ ఏడాదిలోనే సినిమాను విడుదల చేయడానికి ప్రయత్నం చేస్తున్నాం. మాగ్జిమం డిసెంబర్‌లో సినిమా ప్రేక్షకుల ముందుకొస్తుంది. షూటింగ్ పెండింగ్ ఉన్నా సినిమా పని జరుగుతూనే ఉంది. మచిలీపట్నం పోర్ట్ సీక్వెన్స కొన్ని సీన్స ఉన్నాయి. ఆ సన్నివేశాల సీజీ బావుండాలని ఇరాన్లో చేయిస్తున్నాం. కుస్తీ ఎపిసోడ్ బెంగళూరులో సీజీ చేస్తున్నారు. ఛార్మినార్ సన్నివేశాలను హైదరాబాద్‌లోనే చేయిస్తున్నారు. సినిమా చూస్తున్న ఆడియన్స్‌ని పీరియాడికల్ అట్మాస్ఫియర్‌కు సినిమా తీసుకెళ్తుంది. ఇందులో పవన్ కల్యాణ్ చేసే వీరోచిత పోరాటాలు ఆకట్టుకుంటాయని అన్నారు. ఖజీలిని.తూణఇందులో పవన్ కల్యాణ్ పేదల పక్షాన పోరాడే యోధుడిగా కనిపిస్తారు. 17వ శతాబ్దం మొగల్ సామ్రాజ్యం నేపథ్యంలో సాగే ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా తీసుకురానున్నారు. మొదటి పార్ట్‌ను 'స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో విడుదల చేయనున్నారు. 'ధర్మం కోసం యుద్ధం' అనేది ఉపశీర్షిక. ఈ చిత్రంలో నిధి అగర్వాల్ కథానాయిక. బాబీ దేవోల్, సునీల్, నోరా ఫతేహి తదితరులు కీలక పాత్రధారులు. ఎం.ఎం. కీరవాణి ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.



# ఆ శుభవార్త ముందే పంచుకుంటా..

### - విక్కీ కౌశల్

**బాలీవుడ్ స్టార్ హీరోయిన్** కత్రినా కైఫ్ ప్రెగ్నెంట్ అంటూ కొన్ని రోజులుగా వస్తోన్న వార్తలపై ఆమె భర్త విక్కీ కౌశల్ స్పందించారు. తన కొత్త చిత్రం ప్రమోషన్‌లో ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ రూమర్ గురించి మాట్లాడారు. 'అలాంటి శుభవార్త ఉంటే మేమే స్వయంగా మీతో పంచుకుంటాం. సరైన సమయం వచ్చినప్పుడు మేం ఆ విషయాన్ని చెప్పడానికి సిగ్గుపడం' అని చెప్పారు. ఇక పెళ్లి తర్వాత తనలో వచ్చిన మార్పులపై విక్కీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'పెళ్లి తర్వాత ప్రతిఒక్కరిలో మార్పు వస్తుంది. మరో వ్యక్తితో కలిసి జీవితాన్ని ప్రారంభించడం చాలా పెద్ద విషయం. అప్పటివరకు మన కోసం ఆలోచిస్తాం.. వివాహం అనంతరం ఇద్దరి గురించి ఆలోచించాలి. ప్రతీ నిర్ణయం ఇద్దరికీ అనుగుణంగా తీసుకోవాలి. నా 36 ఏళ్ల జీవితంలో మొదటి 33 ఏళ్ల కంటే గత రెండున్నరేళ్లలోనే ఎంతో ఉన్నతంగా ఆలోచించడం ప్రారంభించాను. వివాహం తర్వాత ఎన్నో విషయాల్లో మార్పు వచ్చింది' అని చెప్పారు.



# కల్కి పార్ట్-2 కూడా ఉంటుంది: అశ్వనీదత్

## వచ్చే ఏడాదికల్లా సిద్ధం చేస్తాం..

**నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ప్రభాస్** హీరోగా తెరకెక్కిన 'కల్కి 2898 ఏడీ' తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చి మంచి టాక్‌ను సొంతం చేసుకుంది. ఈ సినిమాపై సినీ ప్రముఖులు ప్రశంసలు కురిపిస్తున్నారు. తాజాగా ఈ సినిమాను ఉద్దేశిస్తూ అగ్ర కథానాయకులు రజనీకాంత్,నాగార్జున పోస్ట్‌లు పెట్టారు. చాలా అరుదుగా సినిమా విషయాలపై పోస్ట్ పెట్టే రజనీ 'కల్కి' చిత్రబృందంపై ప్రశంసలు కురిపించడంతో ప్రభాస్ అభిమానులు సంబరపడుతున్నారు. కల్కి' అద్భుతంగా ఉంది. ఇండియన్ సినిమాను నాగ్‌అశ్విన్ మరో స్థాయికి తీసుకెళ్లారు. ఇందులో నటించిన వారికి, ఈ సినిమా కోసం పనిచేసిన అందరికీ శుభాకాంక్షలు. దీని రెండోభాగం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా' అని రజనీకాంత్ పేర్కొన్నారు. ఈ పోస్ట్‌కు దర్శకుడు నాగ్ అశ్విన్ రిప్లై ఇస్తూ.. మాటలు రావడం లేదన్నారు. టీమ్ అందరి తరఫున కృతజ్ఞతలు చెప్పారు. నాగార్జున కూడా సోషల్ మీడియా వేదికగా టీమ్‌కు అభినందనలు తెలిపారు. 'నాగ్ అశ్విన్ మిమ్మల్ని ఒకసారి కలవాలి. అమితాబ్ మీరు అసలైన మాస్ హీరో.. మీ నటనతో మరోసారి ఆశ్చర్యపరిచారు. పార్ట్2లో కమల్ హాసన్‌ని చూడడం కోసం వేచిచూస్తున్నా. ప్రభాస్ నువ్వు మరోసారి సత్తా చాటావు. దీపికా చాలా అద్భుతంగా నటించారు. మీరంతా కలిసి ఇండియన్ సినిమా స్థాయిని మరోసారి నిరూపించారు' అని ప్రశంసించారు. మరోవైపు 'కల్కి'పై ప్రశంసలు కురిపిస్తూ హాలీవుడ్ మీడియా కథనాలు రాసింది. ప్రముఖ హాలీవుడ్ మీడియా సంస్థ డెడ్ లైన్ 'కల్కి' అద్భుతంగా ఉందని పేర్కొంది. దీంతో ప్రభాస్ అభిమానులు ఈ విశేషాలను షేర్ చేస్తున్నారు.